
జాగ్వార్ జస్వంత్
మధుబాబు

# జాగ్వార్ జస్వంత్

చంద్రగఢ పౌరమండలి ముందు నృత్య ప్రదర్శన యిస్తున్నది రాజనర్తకి తార. ఆమె వంపుసొంపుల హొయలు చూసి ప్రేక్షకులు ' వహ్వా ' అని మెచ్చుకుంటున్నారు.

ఎప్పుడూ లేనిది, ఆరోజు చంద్రగఢ సైన్యాధిపతి రాణా ఆమె నృత్యాన్ని తిలకించటానికి వచ్చాడు. అతన్ని మెప్పించాలనే ఉద్దేశ్యంతో మరిన్ని మెలుకువలు చూపిస్తున్నది తార. ప్రేక్షకులను మత్తెక్కిస్తున్నది.

రాజ ప్రసాదం మీది నగారా అర్ధరాత్రి అయినట్లు సూచించింది.

తార నృత్యం తారాస్థాయికి చేరుకున్నది. ఆమె కాలిగజ్జెల ధ్వని ప్రేక్షకులకు మృదంగ నాదంలా వినిపించసాగింది.

" ఖడ్ జావ్ ! " అన్న కేకతో మారుమ్రోగిందా భవనం. అదిరిపడిన తార నృత్యాన్ని ఆపింది హఠాత్తుగా. ఏవో లోకాల్లో విహరిస్తున్న ప్రేక్షకులు ఒక్కసారిగా ప్రస్తుతంలోకి వచ్చి పడ్డారు.

అడ్డుపడుతున్న భవన రక్షకులను విదిలించి కొట్టి పరుగు పరుగున ఆ మందిరంలోకి వచ్చాడొక సైనికుడు. సరాసరి రాణా ముందుకు వచ్చి నిలబడ్డాడు. ఆయాసంతో ఎగసి పడుతున్నాయతని గుండెలు దుస్తులన్నీ స్వేదంతో తడిసి వున్నాయి. " రాణా సాబ్ ...

శత్రువులు కోటను సమీపిస్తున్నారు. తూర్పు నుంచి ఈస్టిండియా కంపెనీవారి ఫిరంగిదళం ముందుకు వస్తున్నది. ఉత్తరదిశ నుంచి చంచల్ ఘడ్ గజదళం కమ్ముకుంటున్నది. వారి పదాతిదళం కోటకు పదిక్రోసుల దూరంలో మోహరించివున్నది." ఆయాసంతో వగరుస్తూ తన మాటలు రాణాకు తప్ప మరొకరికి వినిపించకుండా గొంతు తగ్గించి రహస్యంగా చెప్పాడా సైనికుడు.

రాణా ముఖం జేవురించింది. ఆవేశం అతని నరనరాలకు పాకిపోయింది.

"కోట తలుపులు మూయించి, బురుజుల మీది ఫిరంగిని సిద్ధం చేయించండి. పావుగడియలో నేను వచ్చి కలుసుకుంటాను." అంటూ చివాలున లేచి నిలబడ్డాడు.

వారేం మాట్లాడుకుంటున్నారో ప్రేక్షకులకు అర్థం కాలేదు.

"అత్యవసర కార్యం మీద, అనుమతి లేకుండా వచ్చి తారాదేవి నృత్యానికి అంతరాయం కలిగించిన నా సైనికుడి తరుపున నేను క్షమాపణ కోరుకుంటున్నాను. యిక మీరు నిరాటంకంగా మీ కార్యక్రమాలను కొనసాగించుకోవచ్చు." అని ఆ మందిరం నుంచి నిష్క్రమించాడు రాణా.

తిరిగి నృత్యం ప్రారంభించింది తార. ఆమెలో వెనుకటి ఉత్సాహం నశించింది. ప్రేక్షకుల కరతాళ ధ్వనులు ఆమెకు ఆనందం కలిగించలేక పోయాయి.

★ ★ ★

చంద్రగఢ రాజప్రసాదం చుట్టూ అప్రమత్తతతో పహారా
కాస్తున్నారు మహారాజు అంగరక్షక బృందానికి చెందిన సైనికులు.

చలువరాతి శయన మందిరంలో నిద్రపట్టక పచార్లు చేస్తున్నాడు మహారాజు నారాయణరావు. మరొకవైపు పట్టు పానుపు మీద ఆదమరిచి నిద్రిస్తున్నాడు యువరాజు జస్వంత్.

గవాక్షాలకు వ్రేలాడతీసిన పట్టుతెరలను తొలగించి కిందికి చూశాడు రాజా నారాయణరావు. పౌరమండలిని అలరిస్తున్న తారాదేవి నృత్యపు ధ్వనులు అస్పష్టంగా వినవస్తున్నాయి గాలివాలున.

గట్టిగా నిట్టూర్చి వెనుతిరగబోయి, ప్రాంగణంలోకి అడుగుపెట్టిన రాణాను చూసి, కనుబొమ్మలు ముడివేశాడు మహారాజు. వెంటనే శయన మందిరం నుంచి సభామందిరంలోకి పోయాడు.

అప్పుడే లోనికి వచ్చాడు రాణా. మహారాజుకు వందనం చేశాడు. " ప్రభూ ....... యువరాజు ? " అని ప్రశ్నించాడు శయన మందిర ద్వారంవైపు చూస్తూ, " నిద్రిస్తున్నాడు రాణా బరువు బాధ్యతలు తెలియని వయస్సు యువరాజుది. ఘడియ క్రితం వరకూ తార నృత్యం చూడబోతానని మారాంచేసి నిద్రలోకి జారిపోయాడు. "

దీర్ఘంగా నిట్టూర్చాడు రాణా. " ప్రభూ ... చంచల్ ఘడ్ వారు ఈస్టిండియా కంపెనీతో చేయి కలిపిన రోజునే మిమ్మల్ని హెచ్చరించాను .... ఆ దుర్మార్గులకు ఆలోచన చెప్పే గుంటనక్కలు

లభించాయని. నా మాటను కొట్టిపారేశారు మీరు " అన్నాడు మహారాజు చూపించిన ఆసనం మీద కూర్చుంటూ.

" రాణా ..... ఎనుబది సంవత్సరాలు నిండాయి మాకు. యువరాజుకు యీ సింహాసనం అప్పగించటానికే బ్రతికి వున్నాం గాని రాజ్య పరిపాలన కోసం కాదు. మరో ఐదు సంవత్సరాలు ఆగి యువరాజుకు చెప్పు నీ ఆలోచనలు మా వృద్ధ హృదయానికి శ్రమ కలిగిస్తావెందుకు ? " చిరునవ్వుతో అన్నాడు రాజా నారాయణరావు.

మౌనంగా రోదించింది రాణా హృదయం, ఆ మాటలు వినగానే.

కుమారరాజా మాధవరావు చంచల్ ఘడ్ యుద్ధభూమిలో వీర మరణం పొందిన నాటినుంచి మహారాజుకు రాజ్య పరిపాలన మీద విరక్తి కలిగింది. మాధవరావు మరణించే నాటికి అతని భార్య భవాని పూర్ణ గర్భవతి. చంద్రగఢ సంస్థానాధీశులైన రావు వంశీయులకు వంశోద్ధారకుడు జస్వంత్ రావును ప్రసాదించి భర్త ఖడ్గాన్ని వడిలో వుంచుకొని సహగమన ధర్మాన్ని పాటించిందా పవిత్ర హృదయం.

రాజ సింహాసనానికి వారసుడు జస్వంత్. అతనికి సింహాసనాన్ని అధిష్టించే వయస్సు వచ్చేవరకూ వృద్ధరాజు నారాయణరావే రాజకార్యాలను నిర్వహించ వలసి వచ్చింది.

జస్వంత్ కి యిప్పుడు పది సంవత్సరాలు నిండి పదునొకండో సంవత్సరం అడుగు పెడుతున్నది.

మనవడి ఆట పాటలు తప్ప మరొక విషయాన్ని పట్టించుకోని మహారాజుకు చంచల్ ఘడ్ వారు కమ్ముకొస్తున్నారన్న విషయాన్ని ఎలా చెప్పాలో తెలియక తికమక పడసాగాడు రాణా.

" ఇంత రాత్రివేళ మా శత్రువుల మనస్తత్వాలను గురించి
చెప్పవలసిన అగత్యం ఏమొచ్చింది రాణా ? " అని అడిగాడు మహారాజు.

" ప్రభూ .... దెబ్బతిన్న పామును జాలి తలచి వదలటం ప్రమాదం. ఆనాడు కుమార రాజా వారి మరణంతో మీరు యుద్ధాలను అసహ్యించుకొని చంచల్ ఘడ్ విషనాగులను క్షమించి వదిలేశారు. ఈనాటికి వారి నడుములు గట్టిపడ్డాయి " ఆ మాటలకు మరొక చిరునవ్వే సమాధానం అయింది.

" ఎలా చెప్పమంటారు ప్రభూ ? ఏమని చెప్పమంటారు ? నాతో రండి .... మీకే తెలుస్తుంది. " అంటూ మహారాజు చేయి పట్టుకొని రాజమందిర పై భాగానికి తీసుకుపోయాడు రాణా.

చంద్రగఢ కోటలోని భవనాలన్నిటికంటె ఎత్తైనది రాజ ప్రసాదం. దాని బురుజు మీద నిలబడి ఉత్తర దిక్కుకు చూసిన రాజా నారాయణరావుకు, క్షణక్షణానికీ కోటకు దగ్గిరగా వస్తున్న కాగడాల గుంపు కనిపించింది.

ఉత్తర దిక్కున పర్వత మార్గం వుంది. అది శత్రువుల చేతికి చిక్కనంత వరకూ చంద్రగఢ సైనికులకు ఎదురులేదు.

నేర్పరులైన శత్రువులు అతి లాఘవంగా ఆ మార్గాన్ని తమ గజదళంతో నింపి వేశారు.

పది క్షణాలపాటు ఆ సంచలనాన్ని గమనించి వెనుతిరిగాడు మహారాజు.

" యుద్ధాలను అసహ్యించుకున్నాం గాని, ఆత్మరక్షణ ప్రయత్నాలను ఏవగించుకోలేదు రాణా. ఇంత కాలానికి మరొకసారి మా ఖడ్గానికి పని కలిగింది. సైన్యాన్ని సిద్ధం చేయించు " ధవళ వర్ణాన్ని పొందిన మీసాలను మెలివేస్తూ బురుజు దిగాడు మహారాజు.

క్రింద శయన మందిరంలో యువరాజు జస్వంత్ ప్రశాంతంగా నిద్రబోతున్నాడు, నిద్దురలో నవ్వుకుంటూ.

ఆప్యాయంగా మనవడి ముంగురులను సవరించాడు మహారాజు.

" రాణా .... మా కంటి వెలుగు యీ చిరంజీవి. రావు వంశం కోల్పోయిన ప్రాభవాన్ని మా యువరాజు కాలంలో తిరిగి పొందగలుగు తుందనే నమ్మకం, ఆశ మాకు ఉన్నాయి. చంద్రగఢ రాజవంశ కష్ట నిష్టురాలలో రాణా వంశీయులకు ఆది నుంచి భాగం వుంది రాణా ! నేడో రేపో రాలిపోయే ఎండుటాకు మా తనువు. మమ్మల్ని ఎంత విశ్వాసంతో సేవించావో అదే విశ్వాసంతో మా చిరంజీవికి అండగా నిలుస్తావు కదూ ? " ఆర్ధ్రంగా అడిగాడు, రాణా వంక చూస్తూ.

రాణా కంటి వెంట భాష్పధారలు కట్టాయి.

" ప్రభూ ! ఏమిటి ఈ అప్పగింతలు ? ఈ రాణా తనువులో కొసప్రాణం వున్నంత వరకూ నా రాజ కుటుంబానికి ఎటువంటి ఆపదా రాదు. ఈరాణాకు ఆలోచన చెప్పగల శక్తి కలిగి వున్నంతవరకూ చంద్ర గఢ సంస్థానాన్ని ఏ నీచులూ కన్నెత్తి చూడలేరు. చంద్ర గఢ దుర్గ దేవత భవానీమాత పాదాల సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. యువరాజు జస్వంత్ తన ముత్తాతలు కోల్పోయిన పద్నాలుగు దుర్గాలను తిరిగి తన పరిపాలన క్రిందికి తెచ్చుకుంటాడు. అందుకు మీ సేవకుడు యీ ఒక్క రాణానే కాదు .... చంద్రగఢ సైన్యంలో వున్న రాణా వంశీయులందరు తమ వాడి కత్తులతో వేడి నెత్తురుతో యువరాజు వెనుక నిలబడతారు. యిది సత్యం ముమ్మాటికి సత్యం యిది మహారాజా ! " ఖడ్గాన్ని వరనుండి దూసి మహారాజు పాదాలకు ఆనించి ప్రమాణం చేశాడు ఆవేశంతో.

భవనం బయట కలకలం చెలరేగింది. ఆ కలకలానికి తోడుగా కోట బురుజుల మీది యుద్ధభేరి మ్రోగసాగింది.

సారా తాగిన యుద్ధగజాలు క్రోధంతో ఘీంకారాలు చేయటం ప్రారంభించాయి. యుద్ధ నగారాలు తమ ప్రచండ నాదంతో సైనికుల్ని హెచ్చరించసాగాయి.

ఆ ధ్వనులు వింటూ నిలబడి పోయిన మహారాజు, సైన్యాధిపతులు యిద్దరూ గజదళాధిపతి శ్రీకేతుడు మందిరంలోకి రావటం చూసి చలనం తెచ్చుకున్నారు.

" ప్రభూ ! కోట ద్వారాలు మూయించి పౌరులకు హెచ్చరికలు పంపటం అయిపోయింది. సర్వ సన్నద్ధులయ్యారు సైనికులు. మీ ఆజ్ఞల కోసం ఎదురు చూస్తున్నారు దళపతులు. " అని విన్నవించాడు శ్రీ కేతుడు.

తల్పం పక్కనేవున్న దంతపు పేటికలో భద్రపరచబడి వున్నది చంద్రగఢ వంశీయుల రాజఖడ్గం, కవచ శిరస్త్రాణాలు ధరించి ఆ

ఖడ్గాన్ని అందుకున్నాడు మహారాజు.

భవన ప్రాంగణంలో నిలబడివున్న అంగరక్షక దళం మహారాజును ఆ రూపంలో చూడగానే, జయజయ ధ్వానాలు చేసింది.

" రాణా .... చిరంజీవి !" అంగరక్షకులు ఆయత్తం చేసిన అశ్వాన్ని అధిరోహిస్తూ అన్నాడు మహారాజు.

ఆ మాట వినగానే ఒక సైనికుణ్ని దగ్గిరికి పిలిచాడు రాణా.

" రాజ నర్తకి తారాదేవికి మా మాటగా విన్నవించు. యుద్ధ నాదాల వల్ల యువరాజు అలజడి చెందకుండా అతన్ని జాగ్రత్తగా చూసుకోమని చెప్పు. " అంటూ మహారాజును అనుసరించాడు.

పావు ఘడియలో ఆ వార్త తారకు అందింది. నృత్య సమయంలో ధరించిన వలువలను యింకా విడువలేదామె. అలాగే రాజ మందిరానికి తరలి వచ్చింది. అంగ రక్షక దళం మహారాజును అనుసరించిపోయింది. వారి స్థానంలో సుశిక్షుతులైన మహిళా సైనిక బృందం రాచమందిర రక్షణ బాధ్యతను స్వీకరించింది.

★ ★ ★

చంద్రగఢ ప్రధాన సింహద్వారం మీద అమర్చబడి వుంది ' భవాని. ' పోర్చుగీసు పరిపాలకులు రాజా నారాయణరావు తాతగారి కాలంలో బహూకరించిన ఫిరంగి అది. దానితో పోటీ చేయగల ఫిరంగులు తిరిగి ఒక్క మొగలాయీ చక్రవర్తుల వద్దే వున్నాయి.

" భవాని " ని పసుపు కుంకుమలతో పూజించి టెంకాయకొట్టి దుర్గ దేవతకు ముడుపులు కట్టాడు మహారాజు.

శత్రువులు కోటకు సమీపంలోకి వచ్చారు. తమ ఫిరంగులను ముందుకు పంపి కోటవైపు గురి పెట్టిస్తున్నారు ఈస్టిండియా కంపెనీ వారి కమాండర్లు.

మరొక దిశ నుంచి చంచల్ ఘడ్ అశ్విక దళం ముందుకు దూకుతున్నది. వెనుకవున్న పర్వత మార్గాన్ని ఆక్రమించుకున్న గజదళం కోటను చుట్టి, పదాతి దళానికి బాసటగా చంద్రగఢ సింహద్వారం ముందు మొహరిస్తున్నది.

చంద్రగఢ కోట బురుజులన్నీ సైనికులతో నిండివున్నాయి. మంటలు వేసి నూనె, నీరు మొదలయిన ద్రవాలను వేడి చేస్తున్నారు కొందరు, కోటగోడల మీదికి ఎగప్రాకటానికి ప్రయత్నించే శత్రువు మీద కుమ్మరించటానికి. విలుకాండ్లు అమ్ముల పొదులను అందుబాటులో పెట్టుకుంటున్నారు శరవర్షం కురిపించటానికి వీలుగా. వారికి శత్రు బాణ పరంపర నుంచి రక్షణ కల్పించేటందుకు

చర్మాలతో తయారు చేయబడ్డ డాళ్ళు పట్టుకొని సిద్ధంగా వున్నారు అంగరక్షకులు.

శత్రువులు వచ్చి పడ్డారని వార్త అందిన ఘడియ సేపటిలో ఎటువంటి దాడినైనా ఎదుర్కోవటానికి సర్వసన్నద్ధమైంది చంద్రగఢ కోట.

దిక్కులు పిక్కటిల్లే ధ్వనితో పేలింది ఈస్టిండియా కంపెనీ వారి ఫిరంగి ఒకటి. నిప్పురవ్వలు వెదజల్లుతూ వచ్చి కోటలో పడింది దాని గుండు. దాని వెనుకనే మిగిలిన ఫిరంగులన్నీ మోతలు చేయటం ప్రారంభించాయి. కాగడా వెలుగులను కప్పివేసేటంత పొగతో నిండి
పోయింది కోట కింది మైదానం.

కేకలువేస్తూ ముందుకు దూకింది చంచల్ ఘడ్ సైన్యం. పదాతి దళం పొడుగాటి నిచ్చెనలు పట్టుకొని కోట గోడలను సమీపించారు. వారి వెనుకవున్న విలుకాండ్రు కోట మీది సైనికులపై శరవర్షం కురిపించసాగారు.

కాల్బాలానికి రక్షణగా అశ్వికదళం వచ్చింది. వారికి బాసటగా గజదళం అడుగు కదిపింది. పెద్ద పెద్ద యినుప గదలను తొండాలతో పట్టుకొని కోట ద్వారాలను పగులకొట్టటానికి ముందంజ వేశాయి యుద్ధగజాలు. సైనికుల చెవులు చిల్లులు పడేటట్లు వినిపిస్తున్నాయి వాటి ఘీంకారాలు.

ఒక్క బాణం కూడా శత్రువుల మీదికి వదలలేదు చంద్రగఢ సైనికులు. అందరూ సైన్యాధిపతి ఆజ్ఞలకోసం ఎదురుచూస్తున్నారు ఓపికగా.

" రాణా ! రాను రాను వీరత్వానికి విలువలేకుండా పోతున్నది యీ పవిత్ర భారతభూమిలో. హెచ్చరిక లేకుండా యుద్ధం ఆరంభించారు చూశావా ? " అన్నాడు ఆవేదనగా, మహారాజు.

" చీకటి మాటున చుట్టుముట్టిన వారికి అటువంటి పదాలకు అర్థం కూడా తెలుస్తుందా ? మహారాజా ..... అనుజ్ఞ యివ్వండి. నరబలి కోసం భవాని ఆశగా ఎదురు చూస్తున్నది. శత్రు రక్తం త్రాగి భవిష్యత్తులో బంగారు పంటలు అందించటానికి ఉగ్రూత లూగుతున్నది చంద్రగఢ భూమాత. ఆజ్ఞ యివ్వండి మహారాజా ! " శత్రువుల కదలికను జాగ్రత్తగా గమనిస్తున్న రాణా హెచ్చరించాడు మహారాజును.

దీర్ఘంగా నిట్టూర్చి, చేయి జాచాడు మహారాజు.

రంగు రంగుల పతకాలు కట్టి, పసుపు కుంకుమలతో అలంకరించబడి వున్న ఆరుమూరల ఈటెను అందించారు అంగ రక్షకులు.

" జై భవానీ ..... " అన్న నినాదంతో దద్దరిల్లిపోయాయి కోట బురుజులు. ఆ నినాదాల మధ్య, ఈటెను శత్రువుల మీద

ప్రయోగించాడు మహారాజు. శత్రువులు పట్టుకున్న కాగడాల వెలుగుపడి పరిగెత్తుతున్న కాంతిరేఖలా కనిపించింది.

సూటిగా పోయి కోట ద్వారాన్ని పగుల కొట్టటానికి వస్తున్న ఒక యుద్ధ గజపు కుంభ స్థలంలో దిగబడింది.

అదే సూచనగా శత్రువులను ఎదుర్కోవటం ప్రారంభించారు చంద్రగఢ సైనికులు. నేర్పరులైన విలుకాళ్ళు అంత చీకటిలో కూడా బాణానికి ఒక శత్రువును బలిచేయసాగారు.

' భవానీ ' దగ్గిర నిలబడి వున్నాడు రాణా. మందు దట్టించి, ఇనుప గుండును అమర్చి సిద్ధంగా వున్నారు సిబ్బంది.

శత్రువుల ఫిరంగులు విధీ విరామం లేకుండా మోగుతున్నాయి. ఆ చీకటిలో గుళ్ళను కోట గోడల మీద పడేటట్లు గురిపెట్టలేక పోతున్నారు వారి సైనికులు.

కోట మీది నుంచి ఫిరంగుల మోత వినరాక పోవటంతో ధైర్యం తెచ్చుకొని మరికొంత ముందుకు జరిగింది ఈస్టిండియా ఫిరంగి దళం.

ఖడ్గాన్ని ఊపాడు రాణా.

నిప్పులు కక్కింది భవాని. అగ్నిశిఖలు వెలువరుస్తూ పోయి మైదానంలో పడింది ఫిరంగి గుండు.

నాలుగు ఫిరంగులు ఉన్నాయి ఆ ప్రదేశంలో. దాని దెబ్బకు తునాతునకలై పోయాయి. శత్రు గజాల ఘీంకారాలు విని క్రోధంతో

చిందులు తొక్కుతున్నాయి చంద్రగఢ యుద్ధగజాలు. వాటిని పట్టి వుంచటం గజ సైన్యాధిపతి శ్రీ కేతునికి అసాధ్యమై పోతున్నది.

అతని హెచ్చరికను పెడచెవిన పెట్టాడు రాణా యుద్ధగజాలను వదిలేటందుకు అనుజ్ఞ యివ్వలేదు.

అర్ధ ఘడియలో పోరు తీవ్రరూపం ధరించింది. చంద్రగఢ సైన్యానికి ఉన్న ఫిరంగి భవాని ఒక్కటే. ఒక్కొక్క గుండుకూ అది అనేకమంది శత్రువులను బలి తీసుకుంటున్నా, శత్రువుల ఫిరంగి దళం విజృంభించింది. భవాని వెలువరిస్తున్న మంటలను ఆధారంగా తీసుకొని ఫిరంగులను గురిపెట్టి కొట్టటం ప్రారంభించారు.

పావుఘడియ పాటు ఎడ తెరిపి లేని అగ్నివర్షం కురిసేసరికి చంద్రగఢ ఈశాన్య గోడ పగులు చూపింది. కేకలు పెడుతూ లోనికి దూకింది చంచల్ ఘడ్ సైన్యం. దారుణమైన దొమ్మి యుద్ధం ప్రారంభం అయింది.

పర్వత మార్గాన్ని ఆక్రమించిన గజ దళం వెనుకవైపు ద్వారాన్ని పగులకొట్టి లోనికి ప్రవేశించింది. దొరికిన సైనికుణ్ని దొరికినట్లు కాళ్ళతో చితకతొక్కుతూ కోటను ఆక్రమించసాగింది చంచల్ ఘడ్ గజదళం.

పగిలిన గోడలో నుంచి వస్తున్న శత్రువుల ధాటికి తట్టుకోలేక వెనుకంజ వేయసాగారు చంద్రగఢ సైనికులు. అది చూసిన రాజా నారాయణరావు ఆగ్రహావేశాలతో కంపించిపోయాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Jaguar+Jaswanth**

* * *